క్లుప్తంగా

శనైశ్చరునికి తైలాభిషేకాలు



మందపల్లి శనైశ్చరాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామిని శనివారం అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించి, ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు జరిపించారు. శనికి ప్రీతికరమైన శనివారం పురస్కరించుకుని దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో భక్తుల పూజలకు ఏర్పాట్లు చేశారు. ముందుగా ప్రాతఃకాల సమయంలో ఆలయ అర్చకులు, వేదపండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపిన అనంతరం భక్తుల దర్శనానికి అనుమతించారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా భక్తుల పూజలు, తైలాభిషేకాల టిక్కెట్లు ద్వారా దేవస్థానానికి రూ.99,245, అన్నప్రసాదం విరాళాల రూపంలో రూ.18,745తో మొత్తం రూ.1,17,990 ఆదాయం వచ్చినట్టు ఏసీ అండ్ ఈఓ తెలిపారు.

వేంకటేశ్వరుని ఆలయంలో భక్తుల రద్దీ



వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో భక్తుల సందడి

అయినవిల్లి: నల్లచెరువులో వేంచేసిన అలమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామివారి దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారువారు జామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితుల స్వామికి తులసిపూజ చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామికి పటిక బెల్లం తులాభారంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

నిత్యాన్నదానానికి విరాళం



దాత గణపతి దంపతులకు స్వామి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదానానికి అయినవిల్లికి చెందిన కోమనపల్లి నాగవెంకట సత్యదుర్గా గణపతి–నాగలక్ష్మి దంపతులు శనివారం రూ.16,500 విరాళం అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అర్చకులకు అందజేశారు. దాతను వేదాశీర్వాదం పలికి, స్వామి శేషవస్త్రాలతో సత్కరించి, స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను పలువురు అభినందించారు.

పి.గన్నవరం ఎంపీడీఓగా ప్రసాద్



ప్రసాద్

పి.గన్నవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నూతన ఎంపీడీఓగా కేవీ ప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ప్రసాద్ జంగారెడ్డిగూడెం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇంత వరకూ ఇక్కడ పనిచేసిన ఎం.భారతి సీతానగరం ఎంపీడీఓగా బదిలీ అయ్యారు.

పేదలకు సాయం పంపిణీ



పేదలకు సాయం అందిస్తున్న సర్పంచ్ ఉమామహేశ్వరరావు

సఖినేటిపల్లి: రామేశ్వరం విలేజ్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యాన శనివారం గ్రామ పంచాయతీ వద్ద నిర్వాహకులు 100 మంది పేదలకు సాయం పంపిణీ చేశారు. ఒక్కొక్కరికీ రూ.100 నగదు, 5 కేజీలు బియ్యం చొప్పున అందజేశారు. కాగా దాతల సాయంతో గత 12 ఏళ్లుగా ప్రతి నెలా ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు ట్రస్ట్ ఫౌండర్ సరెళ్ల విజయ్ ప్రసాద్ తెలిపారు. ఈ నెలకు సేవా కార్యక్రమాలకు గాను ట్రస్ట్‌కు విరాళంగా రూ.15 వేలు సర్పంచ్ కట్టా ఉమామహేశ్వరరావు, ట్రస్ట్ మెంబర్ బళ్ల లక్ష్మణ్‌రావులు కలసి అందజేశారన్నారు. అసోసియేషన్ మెంబర్ ఎ.మధురాజు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పుంతరోడ్లకు మోక్షం కల్పించండి

- భారీ వర్షాలకు బురదగా తయారైన రోడ్లు
- నరకయాతన పడుతున్న రైతులు
- పట్టించుకోకపోవడంపై ఆవేదన



అధ్వానంగా తయారైన సంధిపూడి నుంచి చింతలూరు వెళ్లే పుంతరోడ్డు



పెదపళ్లలో కబ్జాకు గురికావడంతో కుచించుకుపోయిన పుంతరోడ్డు

ఆలమూరు: దేశానికే రైతు వెన్నెముక.. పల్లెటూళ్లు దేశానికి పట్టుగొమ్మలు.. అంటూ అనునిత్యం అనేక మార్లు ప్రజా ప్రతినిధులు, అధికారులు తమ ప్రసంగాల్లో పొగడ్తలతో ముంచెత్తుంటారు, వాస్తవ పరిస్థితులకు వచ్చేసరికి క్షేత్రస్థాయిలో ఎదుర్కొన్న సమస్యలకు కొదవ లేని పరిస్థితి రైతుల్లో నెలకొంటుంది. రైతుల నుంచి ఏటా రూ.కోట్లలో నీటి తీరువా, సెస్‌ల రూపంలో పన్నులుగా వసూలు చేస్తున్న ప్రభుత్వం వారికి అవసరమైన, ఉపయోగమైన పుంతరోడ్ల దుస్థితిని పట్టించుకోవడం లేదు. పంట ఉత్పత్తులను తరలించుకునేందుకు, వ్యవసాయ పనులను చేపట్టేందుకు కనీస అభివృద్ధి చేయాల్సిన పుంతరోడ్లను ఏళ్ల తరబడి పట్టించుకోకపోవడం రైతలకు మనోవేదనకు గురిచేస్తుంది. ఎన్ఆర్‌జీఈఎస్‌లో నిధులున్నా పుంతరోడ్లను పట్టించుకునే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల పరిధిలోని అన్ని గ్రామాల్లో గత నెల గ్రామసభలను ఏర్పాటు చేసి చేపట్టవలసిన సుమారు 200 కిలోమీటర్ల మేర పుంతరోడ్ల అభివృద్ధి పనులపై తీర్మానాలు చేశారు. అయినా దీనిపై ఇప్పటి వరకూ స్పష్టత లేకుండా పోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వెంటాడుతున్న సౌకర్యాల లేమి

క్లస్టర్ పరిధిలోని వివిధ గ్రామాల్లో గతంలో నిర్మించిన అనేక రోడ్లు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చిత్తడి చిత్తడిగా మారి బురదగుంతలను మరపిస్తున్నాయి. అసలే వ్యవసాయం గిట్టుబాటు కావడం లేదనే రైతులు బాధ పడుతున్న తరుణంలో పొలాలకు వెళ్లేందుకు కూడా సరైన సదుపాయాలు లేక విలవిల్లాడుతున్నారు. తమ పశువుల మకాంకు వెళ్లి పాలు తీసుకువచ్చేందుకు బురదగుంటల్లోనే వెళ్లాల్సి రావడంతో తీవ్ర ప్రయాస పడుతున్నారు.

అభివృద్ధి చేయాలంటూ వినతులు

కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లో ఇటీవల జరిగిన గ్రామసభల్లో ఎక్కువగా పుంతరోడ్ల నిర్మాణంపైనే అనేక వినతులు వచ్చాయి. కూటమి ప్రభుత్వం పంచాయతీలకు అధిక ప్రాధాన్యతనిస్తూ నిధుల కొరత రానీయకుండా చేస్తామన్న ప్రకటనలను వాస్తవరూపం దాల్చే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు, వరిపంట కంకిదశకు చేరుకుంటున్న తరుణంలో క్రిమి రసాయన మందులు, కలుపుతీత వంటి పనులు చేపట్టవలసి ఉంది. దీనికి తోడు పశుగ్రాసం అనునిత్యం పొలంగట్లకు వెళ్లవలసి ఉంటుంది.

ఇటువంటి తరుణంలో పుంతరోడ్లు అక్కరకు రాకపోవడంతో రైతాంగం నుంచి తీవ్ర నిరుత్సాహం వ్యక్తమవుతుంది. ఇకనైనా ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు సత్వరమే స్పందించి సత్వరమే పుంతరోడ్లను అభివృద్ధి పరచాలని రైతులు కోరుతున్నారు.

పుంత రోడ్ల అభివృద్ధికి చర్యలు



మండలంలో పుంత రోడ్లు అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే వ్యవసాయ మార్కెట్ కమిటీ, ఎన్ఆర్‌జీఈఎస్ శాఖలకు రైతుల తరపున వినతిపత్రాలను అందజేసి రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశాం.

– కె.జాన్‌లింకన్, ఎంపీడీఓ, ఆలమూరు

ప్రతిపాదనలు రూపొందించాం



పుంతరోడ్ల నిర్మాణానికి ఆయా గ్రామాల నుంచి ప్రతిపాదనలు స్వీకరించాం. ఎన్ఆర్ఈజీఎస్ నుంచి త్వరితగతిన పుంతరోడ్లు నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నాం. రైతుల సౌకర్యార్థం అన్ని చర్యలు తీసుకుంటాం.

– తోరాటి లక్ష్మణరావు, ఎంపీపీ, ఆలమూరు

డ్రైన్ నిర్మాణ పనుల నిలుపుదల



మొగలికుదురులో చేపట్టిన డ్రైన్ నిర్మాణ పనులు

మామిడికుదురు: పంచాయతీ అనుమతి లేకుండా మొగలికుదురులో అనధికారికంగా చేపట్టిన డ్రైన్ నిర్మాణం పనుల్ని పంచాయతీ పాలకవర్గం శనివారం అడ్డుకుంది. రాజోలు మండలం తాటిపాక నుంచి అక్రమంగా మొగలికుదురులోకి డ్రైన్ నిర్మిస్తున్నారని, దీనికి ఏవిధమైన అనుమతి లేదని సర్పంచ్ కడి అరుణకుమారి, పాలక వర్గ సభ్యులు, స్థానికులు పేర్కొన్నారు. తాటిపాక పంచాయతీకి చెందిన మురుగు నీటిని మొగలికుదురులో విడిచిపెట్టడం వల్ల ఇప్పటికే ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నామని, మళ్లీ శ్మశాన వాటిక సమీపంలో డ్రైన్ నిర్మించడం వల్ల సమస్యలు ఇంకా జటిలమవుతాయని పంచాయతీ పాలకవర్గ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. తాటిపాక నుంచి ఎట్టి పరిస్థితుల్లోనూ మొగలికుదురులోకి డ్రైన్ నిర్మించేందుకు వీలు లేదని వారు స్పష్టం చేశారు.

సుజాత కుటుంబ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



సుజాత కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

సఖినేటిపల్లి: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కేశవదాసుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం సుజాత మృతి చెందిన విషయం తెలిసిందే. హెచ్ఎం కుటుంబ సభ్యులను శనివారం మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పరామర్శించారు. ఉయ్యూరువారి మెరకలో సుజాత భర్త పాటి రాజును ఆయన ఓదార్చి, తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. వెంట సరెళ్ల విజయ్ ప్రసాద్, గెద్దం తులసీభాస్కరరావు, కోళ్ల వేణు, కోళ్ల లక్ష్మణ్, లింగోలు బాబు పాల్గొన్నారు.

ర్యాలీని విజయవంతం చేయాలి

సఖినేటిపల్లి: సీపీఐ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ఈ నెల 7న మలికిపురంలో నిర్వహించనున్న ప్రపంచ శాంతి ర్యాలీని కార్యకర్తలు విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, నియోజకవర్గ కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం గొందిలో పార్టీ సమావేశం జరిగింది. రాబోయే రోజుల్లో ప్రపంచ యుద్ధం తలెత్తి మానవాళికి తీవ్ర ముప్పు పొంచి ఉందని సత్తిబాబు, రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. కాగా గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దశల వారీగా పోరాటానికి సిద్ధం కావాలని వారు సూచించారు. గొంది గ్రామ శాఖ కార్యదర్శిగా దొండపాటి భానోజీని ఎన్నుకున్నారు. చెల్లుబోయిన కేశవశెట్టి, గెద్దం ప్రభాకర్ రావు, జంపన ప్రసాదరావు, సీహెచ్ తాతారావు పాల్గొన్నారు.

కొమరాడలో ఉరుసు ఉత్సవం

మామిడికుదురు: కొమరాడ గ్రామంలో సయ్యద్ మొహ్మద్ ఖాదర్ షరీఫ్ ఖాదరి ఉర్ఫ్ హాజీ మస్తాన్ బాబా 'కంబల్ పోష్' ప్రార్థనా స్థలం వద్ద ఉరుసు ఉత్సవం శనివారం ఘనంగా జరిగింది. దీనిలో భాగంగా మగటపల్లిలోని జనాబ్ షేక్ గౌస్ స్వగృహం నుంచి ఫకీర్ల సమ్మేళనంతో గంధం ఊరేగించారు. కొమరాడ డ్యామ్ సెంటర్ వరకు ఈ ఊరేగింపు జరిగింది. ప్రార్థనా స్థలం ట్రస్టీ ఎండీవై షరీఫ్ ఆధ్వర్యంలో మగ్‌రిబ్ నమాజ్ అనంతరం శాంతి, శుభం, సౌభ్రాతృత్వం కోరుతూ (ఫాతెహా) ప్రార్థనలు జరిగాయి. అనంతరం భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్ ఎంఏ రబ్బాని, అబ్దుల్ కలామ్‌తో పాటు భారీ సంఖ్యలో ముస్లింలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు రిఫ్రెషర్ ట్రైనింగ్

సఖినేటిపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయితీల ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులకు ఈ నెల 7, 8 తేదీల్లో రిఫ్రెషర్ ట్రెయినింగ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో పీపీ సత్యనారాయణ శనివారం తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జెడ్పీ సీఈవో వీవీఎస్ లక్ష్మణ్ రావు ఆదేశాలపై రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. పంచాయతీల్లో సాధారణ కనీస పరిపాలన విధానం, ఏపీపీఆర్ చట్టం, పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణ, తాగునీటి సరఫరా, లేఅవుట్, బిల్డింగ్ ప్లాన్ నిబంధనలు, వీధి దీపాలు తదితర అంశాలపై వారికి శిక్షణ ఇస్తామని ఎంపీడీవో అన్నారు.

లక్ష్మీనృసింహునికి జన్మనక్షత్ర పూజలు



అంతర్వేది ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

సఖినేటిపల్లి: అంతర్వేది ఆలయంలో లక్ష్మీనృసింహుని జన్మనక్షత్రం స్వాతి పురస్కరించుకుని శనివారం స్వామివారికి విశేషమైన అష్టోత్తర కలశాభిషేకాన్ని అర్చకులు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, ఆలయ అర్చకులు ఈ పూజలు నిర్వహించారు. తొలుత వశిష్ట గోదావరి నది నుంచి కలశాలతో తెచ్చిన పవిత్ర జలాలకు వేదమంత్రాలతో పూజలు నిర్వహించారు. అనంతరం 108 కలశాల్లో ఉంచిన జలాలల్లోకి శ్రీ స్వామివారి మూల మంత్రంతో ఆవాహనం చేసి అర్చన చేశారు. అలాగే సర్వదేవతలను కలశాల్లోకి ఆవాహనం చేసి విశేష పూజలు నిర్వహించారు. వీటితో పాటు పంచామృతాలతో, వేద మంత్రోచ్చారణల మధ్య స్వామికి విశేష అభిషేకం, పూజలు చేశారు. అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన పథకంలో భోజన వసతి దేవస్థానం సిబ్బంది ఏర్పాటు చేశారు.

క్షతగాత్రుడి వైద్యానికి సాయం అందజేత



బాధితుడి భార్యకు చెక్కు అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: ప్రమాదవశాత్తూ తలకు గాయం కావడంతో వైద్యానికి స్తోమత లేని బాధితుడి కుటుంబానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు శనివారం రూ.15 వేల చెక్కును అందజేశారు. మండలం లక్ష్మీపోలవరం గ్రామానికి చెందిన సానబోయిన సాయిబాబా(27), ఉపాధి నిమిత్తం రెండేళ్లుగా సౌదీఅరేబియాలో ఉంటున్నాడు. రెండు రోజుల క్రితం అక్కడ పని చేస్తుండగా సిమెంట్ ఇటుక తలపై పడి తీవ్రంగా గాయపడ్డాడు. ఆపరేషన్ చేయాలని అందుకు రూ.15 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. కంపెనీ సగం ఖర్చుకు ముందుకు రాగా మిగిలిన ఖర్చు బాధితుడు భరించాల్సి ఉందని బంధువులు తెలిపారు. అయితే అంత ఆర్థికస్తోమత లేని సాయిబాబా కుటుంబ సభ్యులు స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరడంతో సాయిబాబా భార్య తేజశ్రీకి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.15 వేలు చెక్కును అందజేశారు.

నత్రజని ఎరువుల వాడకాన్ని తగ్గించండి



నగరంలో రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ సంచాలకుడు రాజశేఖర్

మామిడికుదురు: వరి పంటపై ప్రస్తుతం బ్యాక్టీరియా, ఎండు తెగులు అధికంగా ఉన్నందున నత్రజని ఎరువుల వాడకాన్ని తగ్గించి పొటాష్ ఎరువులు వేసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకుడు ఏవీసీ రాజశేఖర్ సూచించారు. నగరం గ్రామంలో శనివారం వరి యాజమాన్య పద్ధతులపై అవగాహన సమావేశం జరిగింది. ఏఓ బి.మృదుల సమగ్ర యాజమాన్యంపై శిక్షణ ఇచ్చారు. ప్లాంటోమైసిన్ ఒక గ్రాము లీటరు నీటిలో కలిపి దానిలో రెండు గ్రాముల కాపర్ హైడ్రాక్సైడ్ కలిపి పిచికారీ చేయాలన్నారు. నగరం సర్పంచ్ జాలెం రమణకుమారి మాట్లాడుతూ వ్యవసాయాధికారుల సూచనలు రైతులు విధిగా పాటించాలన్నారు. పి.గన్నవరం ఏడీఏ ఎస్‌జేవీ రామ్మోహనరావు మాట్లాడుతూ రైతులు డ్రోన్ ద్వారా పిచికారీ చేసుకోవడం ద్వారా మంచి ఫలితాలు పొందవచ్చన్నారు. సమావేశంలో వ్యవసాయ సహాయకులు ఎస్.లలిత, బి.కావ్య, రైతులు పాల్గొన్నారు.

పిల్లల సంరక్షణకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి



చొప్పెల్లలో పిల్లలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న సీఐ విద్యాసాగర్

ఆలమూరు: తల్లిదండ్రులందరూ తమ పిల్లల సంరక్షణ ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ అన్నారు. మండలంలోని చొప్పెల్ల గ్రామ పంచాయతీ సమీపాన సర్పంచ్ దంగేటి చంద్రకళ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సీఐ విద్యాసాగర్ పాల్గొని ప్రసంగించారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. తల్లిదండ్రులు ఎల్లప్పుడూ తమ పిల్లలకు స్నేహపూరిత వాతావరణాన్ని కల్పించాలని ఆయన సూచించారు. విద్యార్థి దశలో సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచాలన్నారు. సీఐగా బాధ్యతలు చేపట్టి తొలిసారిగా గ్రామానికి వచ్చిన విద్యాసాగర్‌ను గ్రామ టీడీపీ అధ్యక్షుడు మెర్ల గోపాలస్వామి ఆధ్వర్యంలో గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. నయనాల శ్రీరామచంద్రమూర్తి, జాంప్రోలు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కొత్తపేట: 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం' వీడియో కాన్ఫరెన్స్ ఈ నెల 7న (సోమవారం) ఆర్డీవో కార్యాలయం గ్రౌండ్ ఫ్లోర్‌లో నిర్వహిస్తామని ఆర్డీవో పి.శ్రీకర్ శనివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే సోమవారం నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరయ్యే డివిజనల్ స్థాయిలో అధికారులు, అర్జీదారులు రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయానికి హాజరు కావలసినదిగా కోరారు.

ఇసుక ర్యాంపులు పరిశీలించిన కలెక్టర్



పొడగట్లపల్లిలో ఇసుక ర్యాంపును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్


రావులపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 15 తేదీ నుంచి పూర్తి స్థాయిలో ఇసుక ర్యాంపుల నుంచి తవ్వకాలు నిర్వహించాలన్న సూచన నేపథ్యంలో ఇసుక ర్యాంపులను శనివారం జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ సిబ్బందితో కలసి పరిశీలించారు. మండలంలోని పొడగట్లపల్లి ఒకటి, రెండు, ఇసుక ర్యాంపులను ఆయన అధికారులతో కలసి వెళ్లి పరిస్థితులను చూశారు. ఈనెల 15వ తేదీ నుంచి ఇసుక తవ్వకాలు నిర్వహించేందుకు ఇసుక రాంపుల్లో అనువైన పరిస్థితులు ఉన్నాయా? లేదా అన్న వివరాలను స్థానిక రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. గోదావరి వరద నీరు ప్రస్తుతం ఉధృతంగా ఉందని, వరద పూర్తిగా తగ్గలేదని నీరు తగ్గిన తరువాత ఇసుక ర్యాంపుల్లో తవ్వకాలకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కొత్తపేట ఆర్డీవో శ్రీకర్, గనులు, భూగర్భ శాఖ రియాలిటీ ఇన్‌స్పెక్టర్ టి.సుజాత, రావులపాలెం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు

రావులపాలెం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పలు కోర్సుల్లో మిగిలిపోయిన సీట్లకు అడ్మిషన్లు తీసుకుంటున్నట్టు ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు శనివారం తెలిపారు. 7, 8, 9 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకొని కళాశాల ఆఫీసులో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 9849503404 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

గాయత్రీమాతా నమోస్తుతే..

- పలు అలంకారాల్లో అమ్మవార్ల దర్శనం
- భక్తుల ప్రత్యేక పూజలు



అంబాజీపేటలో కన్యకాపరమేశ్వరికి లక్ష చామంతి పూజ చేసిన భక్తులు



చంద్రఘంటా అవతారంలో పెదపట్నంలంక దుర్గమ్మ



తాటికాయలవారిపాలెంలో అన్నపూర్ణాదేవిగా దర్శనం



అన్నపూర్ణాదేవిగా ఆత్రేయపురం మహాలక్ష్మి అమ్మవారు



కొత్తపేట ఏనుగులమహల్‌లో శ్రీచక్రానికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మామిడికుదురు: శ్రీదేవీ శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం పాశర్లపూడిబాడవలో కొలువుదీరిన కనకదుర్గమ్మ గాయత్రీదేవి అవతారంలో భక్తులను కనువిందు చేశారు. ఈ ఆలయంలో శత చండీయాగ సహిత లక్ష కుంకుమార్చన, లక్ష బిల్వార్చన పూజలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త తోరం వెంకటరమణారావు ఆధ్వర్యంలో ఈ పూజలు జరుగుతున్నాయి. పెదపట్నంలంకలో కొలువుదీరిన కనకదుర్గమ్మ చంద్రఘంటా అవతారంలో భక్తులకు రమణీయంగా దర్శనమిచ్చారు. ఈదరాడ కాలువగట్టు దుర్గమ్మ ఆలయం వద్ద లక్ష ప్రత్యేక పూజలను ఘనంగా జరిపించారు. మామిడికుదురు విజయదుర్గమ్మకు స్వర్ణ పుష్పాలతో విశేష అర్చన నిర్వహించారు. మొగలికుదురులోని కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని నగరం, పెదపట్నం, గెద్దాడ, పాశర్లపూడిలంక, లూటుకుర్రు, ఆదుర్రు, ఈదరాడ, మగటపల్లి, గోగన్నమఠం గ్రామాల్లోని కనకదుర్గమ్మ ఆలయాల్లో ప్రత్యేక కుంకుమ పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా అంబాజీపేట మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఘనంగా కుంకుమ పూజలు నిర్వహించారు. అలాగే వీణాశ్యామలాంబ చంద్రశేఖర స్వామి ఆలయం వద్ద పూజలు చేశారు.

కొత్తపేటలో..

కొత్తపేట: దసరా మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం మండలంలోని కనకదుర్గాదేవి ఆలయాలు, శరన్నవరాత్ర ఉత్సవ పందిళ్లలో అమ్మవారి విగ్రహాలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానంగా కొత్తపేట శివారు ఏనుగులమహల్‌లో రాజరాజేశ్వరిదేవి (శ్రీచక్ర మహామేరు యంత్రం) ఆలయంలో ఆలయ కమిటీ సభ్యుడు సాదు పుల్లయ్య దంపతులు, కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకుడు అయిలూరి సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో శ్రీచక్రానికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆత్రేయపురంలో..

ఆత్రేయపురం: శరన్నవరాత్రులు పురస్కరించుకుని శనివారం అమ్మవారి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని ఉచ్చిలిలో వేంచేసిన విజయదుర్గాదేవి అమ్మవార్ని ప్రత్యేకంగా అలంకరించారు. భజనలు, హరికథలు తదితర సాంస్కృతిక కార్యాక్రమాలు ఘనంగా నిర్వహించారు. అలాగే పేరవరంలో వేంకటేశ్వర స్వామి ఆలయంలో వేంచేసిన కనకదుర్గ, వసంతవాడ పార్వతీదేవి, వాడపల్లి, ర్యాలి తదితర గ్రామాల్లో వేంచేసిన ఆలయాల్లో వివిధ రకాలపూలతో అలంకరించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అయినవిల్లి: మండలంలోని ముక్తికాంత సమేత క్షణముక్తేశ్వర స్వామివారి ఆలయంలో కొలువైన ముక్తికాంత అమ్మవారికి శరన్నవరాత్రుల్లో భాగంగా శనివారం లలితాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ముక్తికాంత అమ్మవారికి సాముహిక కుంకుమ పూజలు చేశారు. అమ్మవారిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అలాగే అమ్మవారికి, లక్ష్మీదేవి అమ్మవారికి, రాజారాజేశ్వరి అమ్మవారికి విశేష పూజలు జరిపారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: తాటికాయలవారిపాలెంలో వేంచేసిన కనకదుర్గమ్మ వారు దశరా మహోత్సవాల సందర్భంగా శనివారం అన్నపూర్ణదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా అమ్మవారికి మహిళలు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్న సమారాధన చేశారు. పి.గన్నవరంలోని శ్రీలక్ష్మీ కనకదుర్గమ్మ వారి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి.